ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

జాతీయ వార్తలు

తేదీ: 26-02-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

ముఖ్యాంశాలు

- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇజ్రాయిల్ పర్యటన ముగించుకొని కొద్ది సేపటి క్రితం స్వదేశానికి తిరిగి పయనమయ్యారు.
- ❖ భారతీయ రైల్వేలో రెండు కీలక సంస్కరణలను ఆ శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ ఈరోజు ప్రకటించారు.
- ❖ రాజ్యసభలో వచ్చే ఏప్రిల్ తో ఖాళీ అవుతున్న 37 స్థానాలకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసింది.
- ❖ ఐసీసీ టీ-20 ప్రపంచకప్ లో భాగంగా చెన్నై వేదికగా భారత్, జింబాబ్వే జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది.

==========

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇజ్రాయిల్ పర్యటన ముగించుకొని కొద్ది సేపటి క్రితం స్వదేశానికి తిరిగి పయనమయ్యారు. అంతకుముందు జెరూసలేంలో ఆ దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో ప్రతినిధి స్థాయి చర్చలు జరిపారు. ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం, రక్షణ, సాంకేతికత, ఆర్థిక సంబంధాల బలోపేతంపై కీలక చర్చలు జరిగాయి. అనంతరం నిర్వహించిన సంయుక్త పాత్రికేయుల సమావేశంలో ఇరువురు ప్రధానులు మాట్లాడారు. ఈ సందర్భంగా వర్ధమాన సాంకేతికత భాగస్వామ్యాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించామని భారత ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. ఈ భాగస్వామ్యం క్రిటికల్ ఎనర్జీ, క్వాంటమ్ టెక్నాలజీ, ఏఐ వంటి రంగాలలో సహకారాన్ని వేగవంతం చేస్తుందని చెప్పారు.

(వాయిస్ 30 సెకన్లు)

ఈ పర్యటనలో భాగంగా జెరూసలేంలోని ప్రపంచ ప్రఖ్యాత హోలోకాస్ట్ స్మారక కేంద్రమైన "యద్ వాషెమ్"ను ప్రధానమంత్రి ఈరోజు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన హోలోకాస్ట్ బాధితులకు పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు.

==========

ఈ ఏడాది 52 వారాల్లో 52 సంస్కరణలను చేపట్టాలనే భారతీయ రైల్వే సంకల్పంలో భాగంగా ఆ శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ మరో రెండు సంస్కరణలను ఈరోజు ప్రకటించారు. న్యూఢిల్లీలో విలేకరులకు ఆయన ఆ వివరాలను వెల్లడించారు. భారతీయ రైల్వేలో ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు అంకుర సంస్థలు, ఆవిష్కర్తలు పాలుపంచుకునేలా రైల్ టెక్ పోర్టల్ ను అశ్విని వైష్ణవ్ ప్రారంభించారు. అదే విధంగా రైల్వే క్లెయిమ్స్ ట్రిబ్యునల్ ఎండ్-టు-ఎండ్ డిజిటలైజేషన్ కోసం రైల్ టెక్ పాలసీని కూడా ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. అంతకుముందు.. నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవడానికి అన్ని సౌకర్యాలతో కూడిన గతి శక్తి కార్గో టెర్మినల్స్ తో పాటూ మెరుగైన ఆన్‌బోర్డింగ్ సేవల కోసం రెండు సంస్కరణలను రైల్వే శాఖ ప్రకటించింది.

==========

రాజ్యసభలో వచ్చే ఏప్రిల్ తో ఖాళీ అవుతున్న 37 స్థానాలకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈరోజు నుండి మార్చి 5 వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చని.. వచ్చే నెల 16న పోలింగ్ జరుగుతుందని ఆ నోటిఫికేషన్ లో పేర్కొంది. మహారాష్ట్రలో 7 స్థానాలు, తమిళనాడులో 6 స్థానాలు, బీహార్, పశ్చిమ బెంగాల్లో ఐదేసి, ఒడిశాలో 4, అస్సాంలో 3, తెలంగాణ, ఛత్తీస్గఢ్, హర్యానాలో 2 స్థానాల చొప్పున, హిమాచల్ ప్రదేశ్‌లో ఒక స్థానం ఖాళీగా ఉన్నాయి.

==========

జాతీయ విద్యా పరిశోధన, శిక్షణా మండలి (ఎన్సీఈఆర్టీ) ఎనిమిదో తరగతి సాంఘిక శాస్త్రం కొత్త పాఠ్యపుస్తకంలో న్యాయవ్యవస్థలో అవినీతిపై ఒక అధ్యాయాన్ని ప్రచురించడం న్యాయవ్యవస్థ ప్రతిష్టను దెబ్బతీయడమేనని సుప్రీం ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. ఈ అంశాన్ని సుమోటోగా పరిగణించిన సుప్రీం కోర్టు ఈరోజు విచారణ చేపట్టింది. ఈ పుస్తకంపై దేశ అత్యున్నత న్యాయస్థానం నిషేధం విధించింది. అన్ని భౌతిక ప్రతులను స్వాధీనం చేసుకోవాలని, దాని డిజిటల్ ఫారమ్లను తొలగించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఏ విధంగానైనా ఆదేశాలను ధిక్కరిస్తే తీవ్రమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఈ విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానానికి కేంద్రప్రభుత్వం బేషరుతుగా క్షమాపణలు చెప్పింది. ఈ వ్యవహారాన్ని తాము సమర్థించుకోవడం లేదని ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పష్టం చేశారు. ఈ పాఠ్యాంశంతో కూడిన పుస్తక పంపిణీ నిలిపివేయాలని కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఎన్సీఈఆర్టీకి ఇప్పటికే ఆదేశాలు జారీ చేసిందని చెప్పారు.

విరామం

==========

పిల్లలు, పౌరుల ఆన్‌లైన్ భద్రతకు సామాజిక మాధ్యమ వేదికలు బాధ్యత వహించాలని కేంద్ర ఐటీ శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. సైబర్ మోసాలు, నేరాలకు వ్యతిరేకంగా ఆయా వేదికలు ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఇటీవల ఈ అంశాలపై పలు ప్లాట్‌ఫామ్స్ తో చర్చించి.. పౌరులను ఆన్‌లైన్‌లో రక్షించేందుకు, చట్టవిరుద్ధమైన చర్యల ప్రచారాన్ని లేదా నేరాలకు పాల్పడే ప్లాట్‌ఫామ్స్ ను అరికట్టేందుకు అవసరమైన చర్యలను తీసుకోవాలని స్పష్టం చేశామన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన ఒక సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్లాట్‌ఫామ్స్ హోస్ట్ చేసే కంటెంట్‌కు అవి బాధ్యత వహించాలన్నారు. ఇంటర్నెట్ స్వభావం మారిపోయిందని.. దశాబ్దాల క్రితం వచ్చిన ఇంటర్నెట్ ప్రస్తుతం ఉన్న ఇంటర్నెట్ కు చాలా భిన్నమైనదని అశ్విని వైష్ణవ్ పేర్కొంటూ...

(వాయిస్ 31 సెకన్లు)

==========

ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులు, భద్రతా దళాలకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. సంఘటనా స్థలం నుండి మూడు రైఫిళ్లు, ఇతర ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా పోలీసు సూపరింటెండెంట్ డాక్టర్ జితేంద్ర యాదవ్ తెలిపారు. బీజాపూర్‌లోని ఇంద్రావతి నది ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నట్లు సమాచారం అందుకున్న భద్రతా దళాల సంయుక్త బృందం గాలింపు చర్యలు చేపట్టింది. ఈ ఆపరేషన్ సమయంలో మావోయిస్టులు.. భద్రతా బృందంపై కాల్పులు జరపడంతో ఎన్ కౌంటర్ చోటుచేసుకుంది.

==========

కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ రేపటి నుండి నాలుగు రోజుల పాటూ.. భారత్ లో పర్యటిస్తారు. మార్క్ కార్నీ ప్రధానమంత్రిగా భాద్యతలు చేపట్టాక చేస్తున్న మొదటి అధికారిక భారత పర్యటన ఇది. మార్క్ కార్నీ రేపు ముంబై చేరుకుని వివిధ వ్యాపార కార్యక్రమాల్లో పాల్గొంటారని విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. భారత్ - కెనడా దేశాలకు చెందిన CEOలు, పరిశ్రమలు, ఆర్థిక నిపుణులు, ఆవిష్కర్తలు, విద్యా వేత్తలు అలాగే భారత్ లోని కెనడా ప్రతినిధులతో మార్క్ కార్నీ సంభాషిస్తారు. మార్చి 2వ తేదీన ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ప్రతినిధి బృందం స్థాయి చర్చలు జరుపుతారు. భారత్ - కెనడా వ్యూహాత్మక భాగస్వామ్యంలోని వివిధ రంగాలలో ఇప్పటివరకు సాధించిన పురోగతిని సమీక్షిస్తారు. ఇరువురు నాయకులు ఆ రోజు సాయంత్రం జరగనున్న ఇండియా-కెనడా CEOల ఫోరమ్‌కు హాజరవుతారు.

==========

ఐసీసీ టీ-20 ప్రపంచ కప్ లో భాగంగా చెన్నైలోని ఎం. ఎ. చిదంబరం స్టేడియం వేదికగా భారత్, జింబాబ్వే జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచిన జింబాబ్వే బౌలింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్ ప్రారంభించిన భారత్ 17 ఓవర్లకు 4 వికెట్లు నష్టపోయి 201 పరుగులు చేసింది. భారత్ ఓపెనర్లు అభిషేక్ శర్మ 55, సంజూ శాంసన్ 24 పరుగులతో శుభారంభం అందించగా.. ఆ తరువాత వచ్చిన ఇషాన్ కిషన్ 38, సూర్య కుమార్ యాదవ్ 33 పరుగులు చేసి రాణించడంతో భారత్ భారీ స్కోర్ దిశగా పయణిస్తోంది. అంతకు ముందు అహ్మదాబాద్ వేదికగా వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో విజయం సాధించిన దక్షిణాఫ్రికా సెమీఫైనల్‌కు చేరుకుంది.

==========

భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (ఉడాయ్) గూగుల్ మ్యాప్స్ మధ్య ఒక ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం ఇకపై దేశంలోని ఆధార్ కేంద్రాల చిరునామాలతో కూడిన వివరాలను గూగుల్ మ్యాప్స్ లో అందుబాటులో ఉంటాయి. దేశ పౌరులకు ఈ ఒప్పందం మరింత సౌలభ్యాన్ని పెంచుతుందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ తెలిపింది. దివ్యాంగులకు అనుకూలమైన మౌలిక సదుపాయాలు, పార్కింగ్ సౌకర్యాల లభ్యత, పని గంటలు మొదలగు సమాచారాన్ని కూడా గూగుల్ మ్యాప్స్ ప్రదర్శిస్తుందని మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ సేవలు మరికొన్ని రోజుల్లో అందుబాటులోకి రానున్నాయని వెల్లడించింది.

==========

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు స్వల్ప నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 82 వేల 276 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమై.. చివరికి 28 పాయింట్ల నష్టంతో 82 వేల 248 వద్ద స్థిరపడింది.

==========
==========